# మార్పు

-సాధనాల నాగవర్ధని

సాయంత్రం స్కూల్‌నించి వచ్చిన రూప "ఏం కనకవ్వా మల్లికని తీసుకురాలేదా!'' అంటూ పనిమనిషిని అడుగుతున్న తల్లిని చూసి కోపంగా లోపలికి వెళ్లిపోయింది.

"ఏందోనమ్మా రెండుదినాలై పిల్లకి ప్యాణం బాగోలేదంటుండె. పొద్దుగాల ఆల్ల నాయిన దవాఖానకు తోల్కపోయి సూది మందిప్పించినంక జెర తక్కువైందిలే! రేపు నేనచ్చేటప్పుడు తీస్కస్తతీ'' అంటూ గబగబా తన పని పూర్తిచేసుకుని ఇంటికి వెళ్లిపోయింది కనకవ్వ.

'పాపం ఈవిడగారు రాకపోతే ఇక్కడ కొంపలంటుకుపోతాయి మరి. హుఁ!' అనుకుంటూ కాళ్లు నేలకు బాదుతూ వంటగదిలో తల్లి దగ్గరకు వెళ్లింది రూప. వంట పని చూసుకుంటున్న సుశీల కూతుర్ని చూచి "ఏం రూపా! ఏమన్నా కావాలా?'' అంది.

"అంటే తమరికి మల్లవ్వ మీద ఉన్న శ్రద్ధలో పదో వంతైనా నామీద లేనట్లే ఉంది. నేను స్కూల్ నించి వచ్చి ఎంతసేపైంది? నాకు బోర్నవిటాగానీ తినడానికి టిఫిన్ గానీ ఇవ్వలేదు. పైగా ఏమన్నా కావాలా? అని అడుగుతున్నావు?'' ఉడుక్కుంటున్న రూపని చూసి నవ్వుకుంది సుశీల.

"ఇదిగో వచ్చేస్తున్నా పద!'' అంటూ జీడిపప్పు వేసి చేసిన ఉప్మా హాట్‌కేస్‌లో నుంచి తీసి ప్లేటులో పెట్టి చెట్నీ గిన్నెతో పాటు తెచ్చి టేబుల్ మీద పెట్టింది సుశీల. గబగబ టిఫిన్ తినేసి హాల్లో టీవీ ఎదురుగా కూర్చుని పోగో ఛానెల్ పెట్టింది కానీ టీవీ మీద ధ్యాస నిలవడం లేదు. ఆలోచనలన్నీ వద్దన్నా మల్లిక మీదకే మళ్ళుతున్నాయి.

అసలు మల్లిక అదే మల్లవ్వ ఎదురుగా ఉంటే ఈ నిముషంలో దాని పీక పిసికి చంపేద్దామన్నంత కోపంగా ఉంది రూపకి. మళ్లీ అనుకుంది. అయినా ఇందులో ఆ పిల్ల తప్పేం ఉంది? తప్పంతా తమ ఇంట్లోవాళ్లదే. ఒకరోజు సాయంత్రం తల్లితో కలిసి పనికి వచ్చిన మల్లవ్వని స్కూల్లో ఎందుకు చేర్పలేదని అమ్మానాన్నగారు అడగడం, అదే టైంలో రూపకి ట్యూషన్ చెప్పడానికి వచ్చిన రామం మాస్టారు మల్లవ్వ చాలా తెలివైందనీ ఆరోక్లాసులో మంచి మార్కులు వచ్చాయని, ఇంట్లో పరిస్థితులు అనుకూలించక తల్లి స్కూల్ మాన్పించిందనీ చెప్పడంతో నాన్నగారు జాలిపడి మా రూప చదివే స్కూల్లో చేర్పించే ఏర్పాటుచేస్తాను, ఇంక పనికి పంపకు అని కనకవ్వకి చెప్పేశారు గట్టిగా.

మర్నాడే స్కూల్లో చేర్చారు కూడా. ఫీజులు కట్టి పుస్తకాలు కొని యూనిఫారం రెండుజతలకి సరిపడా బట్టలు తీసిచ్చి ఇంకా ఏంకావాలన్నా తనని అడగమని గట్టిగా కనకవ్వకి చెప్పారు.

అసలు మల్లవ్వ తండ్రి బుల్లెబ్బాయి రిక్షా తొక్కేవాడు. ఈమధ్య జబ్బు చేసి రిక్షా తొక్కలేక ఇంట్లోనే ఉంటున్నాడు. చదువంటే ఎంత ఇష్టం ఉన్నా పరిస్థితిని గ్రహించుకుని తల్లితోపాటు పనికి వచ్చిన మల్లవ్వని నాన్న స్కూల్లో చేర్చారు. అంతేనా! రేపు ఎదిగిన తర్వాత అంతా వెక్కిరిస్తారని మల్లిక అని పేరు కూడా మార్చారు. అందుకే పాపం మల్లవ్వ మిగతా ఎవరింటికీ పనికి వెళ్లకపోయినా తమ ఇంటికి మాత్రం వస్తూనే ఉంటుంది రోజూ.

"పని చెయ్యొద్దని, పాపతో కలిసి కూర్చుని చదువుకో. ఇద్దరూ ఒకే క్లాసుకదా!'' అంటుంది అమ్మ.

"అమ్మాయిగారూ!'' అంటూ తనతో మాటలు కలపాలని చూసిని తను పట్టించుకోకపోవడంతో మౌనంగా చదువుకుంటూ కూర్చుని నాన్నగారు రాగానే ఆయన కాళ్లకి దణ్ణం పెట్టుకుని ఇంటికెళ్తుంది. ఇదంతా ఆలోచిస్తుంటే పాపం అనిపిస్తుం దొకోసారి.

కానీ ఈవేళ స్కూల్లో జరిగింది తల్చుకుంటే మాత్రం ఒళ్ళు మండుతుంది. ఈ పరిమళ టీచర్ గారు పద్ధతులేంటో తెలియదు. ఎప్పటికప్పుడు టెస్టుల్లో వచ్చిన మార్కులను బట్టి ప్లేసులు మార్చి కూర్చోబెడుతుంది. పోయినసారి తనకి ఐదవ ర్యాంక్. మల్లవ్వకి పదోర్యాంక్. తన వెనుక ఎక్కడో వుండవలసిన మల్లవ్వ ఈసారి మంచిమార్కులు తెచ్చుకోవడంతో తన ప్రక్కకి వచ్చేసింది.

అక్కడికీ తన ప్రక్కన కూర్చోవద్దనీ, మామూలుగా కూర్చునే ప్లేస్‌లోనే కూర్చోమని చెప్పడంతో వెనక్కి వెళ్లిపోయింది. కానీ పరిమళ టీచర్ క్లాసులోకి వస్తూనే "ప్లేస్ ఎందుకు మారావు?'' అని మల్లికని అడిగి జరిగింది తెలుసుకుని "చూడు రూపా! నెక్స్ట్ టెస్ట్‌లో మంచి మార్కులు తెచ్చుకుని మల్లికకన్నా ముందుకు వెళ్ళేందుకు ప్రయత్నించు. అంతేకానీ ఇలాంటి పిచ్చి పనులెప్పుడూ చెయ్యకు'' అనే సరికి తనకి కన్నీళ్లాగలేదు.

తన బెస్ట్‌ఫ్రెండ్ మాధురి తనని ఓదార్చి "అసలు మల్లికంటే నీకెందుకంత కోపం'' అని అడిగింది.

ఎందుకంటే ఏం చెప్పేది? తను వాడి తీసేసిన పాతబట్టలు తొడుక్కుంటూ తన ఇంట్లో పాచిపని చేసే మల్లవ్వ ఒకేసారి తన క్లాసులో చేరి తన ప్రక్క సీట్లోకే వచ్చేస్తే ఎలా భరించడం? అదే చెప్పింది మాధురితో. మాధురి కాస్సేపు ఏదో ఆలోచించి "నేనంటే నీకు చాలా ఇష్టంకదా! ఎందుకని?'' అని అడిగింది.

"అవును. నువ్వంటే నాకు చాలా ఇష్టం. ఎందుకంటే నీవు బాగా చదువుతావు. క్లాస్ ఫస్ట్ స్టూడెంట్వైనా, నేను ఐదోర్యాంక్‌లో ఉన్నా నాతో స్నేహం ఎందుకు చేస్తున్నావు..'' అని ఇంకా ఏం చెప్పాలో తెలియక ఆగిపోయింది తను. అప్పుడు మాధురి అన్నది "రేపు ఉదయం ఆరుగంటలకి ఒకసారి మా ఇంటికి రా'' అని వాళ్ల ఇంటికి ఎలా రావాలో దారి కూడా చెప్పింది. రేపు ప్రొద్దున్నే ఎందుకు రమ్మన్నదో మాధురి? తప్పకుండా వెళ్లాలి అనుకుని టీవీ ఆఫ్ చేసి హోంవర్క్ చేసుకోవడం మొదలుపెట్టింది రూప.

* * *

తెల్లవారగానే త్వరత్వరగా బ్రెష్ చేసుకుని పాలు త్రాగి "అమ్మా! మా ఫ్రెండింటికి వెళ్లి ఇప్పుడే వస్తానని చెప్పి రివ్వున పరుగుపెట్టింది మాధురి ఇంటికి. మాధురి కనబడగానే "ఎందుకు రమ్మన్నావు?'' అన్నది ఆతృతగా.

"పద! నీకో విషయం చెప్పాలి'' అంటూ బయటికి నడుస్తున్న మాధురిని అనుసరించింది రూప. నాలుగైదు వీధులు దాటాక ఓ వీధిలో ఆగి

"అటు చూడు" అంది మాధురి. అక్కడ ఇద్దరు మనుషులు పొడవాటి చీపుళ్లతో రోడ్లు శుభ్రం చేస్తున్నారు.

"వారిలో ఒకరిని చూపించి ఆయన ఎవరో చెప్పగలవా?" అని అడిగింది.

రూపకి ముందు తెలియదు గానీ ఇంతకు ముందెక్కడో చూసినట్లు ఉందే అనుకుంది.

ఇంతలో వాళ్లిద్దరూ ఏదో మాట్లాడుకోవడం మొదలుపెట్టగానే ఆ కంఠస్వరాన్ని బట్టి అతన్ని గుర్తించింది. అతను మరెవరో కాదు. మాధురి వాళ్ళ నాన్న సూర్యారావు.

"అరె! ఆయన మీ...మీ నాన్నగారు కదూ!" ఆశ్చర్యంగా అరిచినంత పనిచేసింది రూప.

స్కూలుకి మాధురి ఫీజు కట్టడానికి వచ్చినప్పుడు చాలాసార్లు చూసింది అతన్ని. ఐతే అప్పుడతను మంచి ఖరీదైన బట్టలు వేసుకుని పెద్ద ఉద్యోగస్తుడు లాగా చాలా డాబుగా కనిపించేవాడు.

మరి ఇప్పుడు ఇదేమిటి? రూప ఆలోచనలు సాగుతుండగానే "ఆ! అవును ఆయనే మా నాన్న" అంది మాధురి.

"ఆయన చేసే ఉద్యోగం అదే! ఇప్పుడు చెప్పు! నీకు నేనంటే అసహ్యంగానో, చికాగ్గానో ఉందా?"

'అబ్బబ్బె ఏం లేదు'అన్నట్లుగా చప్పున తల అడ్డంగా ఊపేసింది రూప. అంతేకాదు. మాధురి చెయ్యి తన చేత్తో గట్టిగా పట్టుకుని "అదేం లేదు. నీవు నాకెప్పటినుంచో ఫ్రెండ్ కదా! ఇప్పుడూ అంతే" అంది గబగబా.

"మరి అలాగైతే మీ ఇంట్లో పనిచేసే కనకవ్వ కూతురు కూడా నీకు చాలారోజులుగా తెలుసు కదా! వాళ్ల అమ్మ పాచిపని చేస్తే ఏం తప్పు? దానికి మల్లిక ఏం చేస్తుంది పాపం! వాళ్ల నాన్నకి ఒంట్లో బాగుండక పనిచేయలేకపోవడంతో వాళ్ల అమ్మే పనిచేసుకుంటుంది. వాళ్ల నాన్న రిక్షా తొక్కినా, వాళ్లమ్మ పాచిపని చేసినా అవేం నీతి మాలిన పనులు కావు కదా! మన సోషల్ టీచర్‌గారు చెప్పలేదూ కష్టపడి సంపాదించుకోవడం నేరం కాదు. నీతిగా ఉంటూ ఏ పని అయినా చేసుకోవచ్చని. మరి నీవు మల్లికని ఎందుకు చీదరించుకుంటావు? స్నేహానికి చూడవలసింది అంతస్తుల భేదం కాదు" అని అంతకన్నా వివరంగా ఎలా చెప్పాలో తెలియక ఆగింది మాధురి.



మాధురి అడిగిన తీరు తన తప్పుని వేలెత్తి చూపినట్లు కాక పరిస్థితి అర్థం అయ్యేలా వివరించినట్లు వుండడంతో ఆలోచనలో పడింది రూప.

"పద!ఇంటికి వెళ్దాం. మళ్లీ స్కూల్‌కి వేళవుతుంది" అని మాధురి రూపతో బాటు ఇంటికి బయలుదేరింది.

ఇంటికి వచ్చినా, స్కూల్‌కి రెడీ అవుతున్నా కూడా మాధురి చెప్పిన విషయాలు మళ్లీ మళ్లీ గుర్తుకువచ్చి మొత్తానికి రూప ఆలోచనాధోరణి మారిపోయింది. ఇకనుంచీ నేను మాధురితోలాగానే మల్లికతోనూ స్నేహంగా ఉంటాను అనుకుంది.

"మమ్మీ! నేను స్కూల్‌కి వెళ్తున్నా" అంది చాలా హుషారుగా. కూతురి హుషారుకి కారణం తెలియక "ఏంటి తల్లీ అంత హడావిడి" అని అడిగింది సుశీల.

"అదా! ఈరోజునుంచీ స్కూల్లోనే కాదు ఇంట్లో కూడా నన్ను అమ్మాయిగారు అని కాక రూపా అని పిలవమని మల్లికకి చెప్పాలి" అంటూ తుర్రుమంది.

★